'షీటీమ్స్' ఫిర్యాదులకు..

గచ్చిబౌలి : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మహిళలు షీటీమ్స్‌కు ఫిర్యాదులు చేసేందుకు ఈ నంబర్లకు వాట్సప్, ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

- సైబరాబాద్ షీ టీమ్స్‌కు మెసేజ్‌లు పంపాల్సిన నెంబర్ 9490617444.
- బాలానగర్– 9490617349
- ఐటీకారిడార్– 9490617352
- మాదాపూర్–8333993519
- కూకట్‌పల్లి– 9493626811
- జగద్గిరిగుట్ట– 9493624561
- మియాపూర్– 9491051421
- పేట్ బషీరాబాద్– 7901114137
- శంషాబాద్– 9490617354
- డయల్– 100 కూడా ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చు.

కొండాపూర్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు బస్సు సౌకర్యం



రాయదుర్గం: కొండాపూర్ నుంచి శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు కొత్తగా గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో నుంచి ఈ బస్సు సౌకర్యం కల్పించారు. రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతి గంటకు ఒక బస్సు అందుబాటులో ఉంటుంది. ఈ బస్సుకు 333 రూట్ నెంబరుగా నిర్ధారించారు. కొండాపూర్ నుంచి ఉదయం 6.30 గంటలకు మొదటి బస్సు బయలు దేరుతుంది. చివరి బస్సు సాయంత్రం 6.10 గంటలకు ఉంటుంది. కొండాపూర్ నుంచి బయలుదేరి హైటెక్‌సిటీ, మాదాపూర్, జూబ్లీ చెక్‌పోస్ట్, జర్నలిస్ట్‌కాలనీ, ఏసీబీఆఫీస్, మాసబ్‌ట్యాంక్ సరోజినీ ఆసుపత్రి, మెహిదీపట్నం, అత్తాపూర్, హైదర్‌గూడ ఎక్స్‌రోడ్డు, ఉప్పరపల్లి ఎక్స్‌రోడ్డు, వీకర్‌సెక్షన్‌కాలనీ, ఆరాంఘర్, ఏజీకాలేజ్, శంషాబాద్ మీదుగా రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వెళ్తుంది.

అమ్మవారికి ముక్కుపుడక బహూకరణ

రాయదుర్గం: నూతన సంవత్సరం నేపథ్యంలో రాయదుర్గం ఎస్సీకాలనీవాసుల ఆరాధ్యదైవం ఊరపోచమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ముక్కుపుడకను బహూకరించారు. ఆదివారం స్థానిక నాయకుడు నరేష్‌దారుగుపల్లి అమ్మవారికి నూతన సంవత్సరం కానుకను అందించి మొక్కు తీర్చుకున్నట్లుగా వివరించారు. గణేష్‌మాదిగ పర్యవేక్షణలో ఆలయ అర్చకుడికి అమ్మవారి ముక్కుపుడకను అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.

కనులపండువగా అయోధ్య అక్షింతల ఊరేగింపు



ఆదర్శనగర్‌లో స్వామివారి కలశాలను ఊరేగిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఆదర్శనగర్‌లో అయోధ్యరాముని అంక్షితల కలశాలను కనులపండువగా ఆదివారం ఊరేగించారు. కాలనీవాసులు మేళ తాళాలతో కాలనీలోని వీధుల్ల రామనామ సంకీర్తనలతో మహిళలు భజనలు, కోలాటాలతో కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపీనగర్, ప్రశాంత్‌నగర్, నెహ్రూనగర్‌లలో ఊరేగింపు నిర్వహించారు.

అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం : అయ్యప్ప నామస్మరణతో శేరిలింగంపల్లి డివిజన్‌లోని శిల్పావ్యాలీ మార్మోగింది. ఆదివారం అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామిని కొలుస్తూ.. అయ్యప్ప భక్తులు ఆలపించిన భక్తిగీతాలు అందరినీ భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. ఈ సందర్భంగా అయ్యప్ప పడిపూజా కార్యక్రమంలో భక్తులతో కలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్వామివారిని దర్శించుకున్నారు.అనంతరం అయ్యప్పభక్తులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కాలనీవాసులు హరినాథ్‌రెడ్డి, రమణి, రామ్మూర్తి, లవకుమార్, అయ్యప్పభక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలోని వర్‌టెక్స్ ప్లెజెంట్ అపార్టుమెంట్ అసోసియేషన్ వారు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమ్యూనిటీహాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోనేరు రాగప్రసాద్, శ్రీనివాస్, అపార్టుమెంట్ వాసులు శ్రీనివాస్, బద్రి, రామచంద్ర, అపార్టుమెంట్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికుల విజ్ఞప్తి మేరకే కమ్యూనిటీహాల్‌ను నిర్మించాం

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



రామారావునగర్‌లో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించిన అనంతరం కాలనీవాసులతో ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: రామారావునగర్ కాలనీలో రూ.10లక్షల అంచనా వ్యయంతో ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే సీడీపీ ఫండ్స్ రూ.10లక్షలను మంజూరు చేశామన్నారు. కమ్యూనిటీహాల్‌లో చిన్న చిన్న సమావేశాలు, శుభకార్యక్రమాలు నిర్వహించుకోవటానికి అనువుగా ఉంటుందన్నారు. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రామారావుకాలనీ అధ్యక్షులు రాజు, సత్య శంకర్, జయప్రసాద్, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రావు, నాగరాజు, మహేందర్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ముత్తంగిలో ఘనంగా మల్లన్న స్వామి జాతర



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ముత్తంగి గ్రామంలో నిర్వహిస్తున్న భ్రమరాంబికామల్లికార్జునస్వామి జాతర మహోత్సవంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దేవాలయాల అభివృద్ధికి పెద్దమొత్తంలో నిధులు కేటాయించారన్నారు. నియోజకవర్గంలోనూ నూతన దేవాలయాల నిర్మాణాలతో పాటు పురాతన దేవాలయాలను సొంత నిధులతో జీర్ణోద్ధారణ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపేందర్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ లైట్లు ప్రారంభం

అమీన్‌పూర్ మున్సిపాలిటీ అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం నవ్య చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు రూ.65 లక్షల హెచ్‌ఎండీఏ నిధులతో ఏర్పాటు చేసిన 108 వీధి దీపాలను మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మకు ప్రత్యేక పూజలు

మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా ఆదివారం సీతారామపురం కాలనీ వాసులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నందుకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాలనీలోని నల్ల పోచమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, మాజీ ఎంపీటీసీ రామచంద్ర రెడ్డి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సేవారత్న అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న కొండా విజయ్

మియాపూర్ : సమాజ సేవలో నిత్యం ఉంటూ.. సేవా కార్యక్రమాలతో ముందుకెళ్తున్న కొండా విజయ్‌కుమార్‌కు లయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ అవార్డును ప్రధానం చేశారు. శనివారం నిర్వహించిన విశ్వానాథ్ గార్డెన్, రీజియన్ మీట్‌లో కొండాకు లయన్స్ ప్రముఖులు అవార్డును అందజేశారు. పేద విద్యార్థులకు ఫీజుల చెల్లింపులు, వేసవిలో చలివేంద్రాలతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడంపై లయన్స్ కొండా విజయ్‌ను లయన్స్ ఘట్టమనేని బాబురావు అభినందించారు. ప్రతి ఒక్కరిలో సేవ చేయాలనే భావన కలగాలని, సేవచేసే ఆలోచన ఉన్నవారికి లయన్స్‌క్లబ్ మంచి వేదిక అని లయన్స్ సభ్యులు తెలియజేశారు. సేవారంగంలో తనకు అవార్డు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. డిస్ట్రిక్ 320డీ మాజీ గవర్నర్ లయన్స్ బన్సల్, ప్రస్తుత గవర్నర్ లక్ష్మీదేవి, రమేష్, సూర్యరాజా, ఓబుల్‌రెడ్డి, ఆశా నిమ్మగడ్డ, చింతపల్లి ఆశా, పద్మావతి, లక్ష్మీనారాయణగౌడ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నజియా, ఆప్తమాలజిస్ట్ మాధవి

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నజియా, ఆప్తమాలజిస్ట్ మాధవి సూచించారు. ఆదివారం కొండాపూర్ డివిజన్ సఫారీనగర్‌లోని న్యూబ్లూమ్స్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో హోలిస్టిక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్ పర్యవేక్షణలో ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడుతూ.. మారిన జీవనశైలిలో పర్యావరణంలో వస్తున్న అనేక మార్పుల వల్ల ప్రస్తుతం చాలామంది అనేక వ్యాధుల భారిన పడుతున్నారన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే అంశాన్ని అందరూ గుర్తించుకోవాలని సూచించారు. నిత్యం వ్యాయామం, మెడిటేషన్, యోగా, ధ్యానం, నడక కనీసం 40 నిమిషాల పాటు విధిగా చేయాలని సూచించారు. తాజా ఆకుకూరలు, సీజనల్ పండ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చేపలు, గుడ్లు, తృణధాన్యాలు, డ్రైఫ్రూట్స్ వంటివాటిని పౌష్టికాహారంగా తీసుకోవాలన్నారు. ఆల్కహాల్, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని చెప్పారు. స్కూల్ కరస్పాండెంట్ కిరణ్, అసోసియేషన్ సభ్యులు విష్ణుప్రసాద్, మల్లేష్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు ఎండీ జాఫర్, ఆసుపత్రి వైద్య బృందం మాలినీ దేవి, శివ, కాలనీవాసులు పాల్గొన్నారు.

రంగోళి పోటీలు.. బహుమతుల ప్రదానం



రంగోళి పోటీల్లో పాల్గొన్న మహిళలు

శేరిలింగంపల్లి: కొమిరిశెట్టి ఫౌండేషన్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల సంయుక్తా ఆధ్వర్యంలో శేరిలింగంపల్లిలోని నేతాజీనగర్, నెహ్రూనగర్, భిక్షపతి ఎన్‌క్లేవ్‌లలో రంగోళి పోటీలను నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా కొమిరిశెట్టి ఫౌండేషన్ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్ మాట్లాడుతూ.. ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలు పండుగలని చెప్పారు. మహిళలు ఉదయాన్నే ఇంటి ముందు రంగవల్లులను తీర్చిదిద్దడం భారతీయ సనాతన సంప్రదాయమన్నారు. ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతగా వరలక్ష్మి వ్యవహరించారు. ప్రతి కాలనీకి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను విజేతలకు అందజేశారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్ మల్లేష్, స్థానిక మహిళా నాయకురాలు కుమారి, దివ్య, మెర్సీ, శోభ తదితరులు పాల్గొన్నారు.

భూములను లాక్కోవడం సరైంది కాదు



రైతులతో మాట్లాడుతున్న నాయకులు

మానవ హక్కుల వేదిక ప్రతినిధులు

జిన్నారం(పటాన్‌చెరు): రైతుల భూములను బలవంతంగా లాక్కోవడం సరైంది కాదని మానవ హక్కుల వేదిక నిజనిర్ధారణ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిన్నారం మండలంలోని గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని అల్లీనగర్ గ్రామంలోని 27వ సర్వే నంబర్‌లో రైతులు సాగు చేసుకుంటున్న భూములను పరిశ్రమ ఏర్పాటు పేరిట లాక్కోవడంతో ఆదివారం మానవ హక్కుల నిజనిర్ధారణ కమిటీ నాయకులు రైతులతో సమావేశమయ్యారు. రైతులతో మాట్లాడిన నాయకులు వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రైతులు సాగు చేసుకుంటున్న భూములను బలవంతంగా పరిశ్రమల స్థాపన పేరిట లాక్కోవడం సరైంది కాదన్నారు. రైతులకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నిజనిర్ధారణ కమిటీ నాయకులు శంకర్, సురేశ్, రోహిత్, సంజీవ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

గచ్చిబౌలి: రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయదుర్గం ప్రధాన రోడ్డులో రాత్రి 11.30 గంటలకు సుమారు 40–45 ఏళ్లున్న వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో క్రేన్‌ను కలిగిన భారీ వాహనం (ఏపీ21బీఎం6257) అతడిని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ఆలిండియా క్రాఫ్ట్‌మేళా



మాదాపూర్ : శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్‌మేళా ఆదివారంతో ముగిసింది. చేనేత కళాకారులు తయారుచేసిన ఉత్పత్తులు నగరవాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ సౌజన్యంతో రాజస్థాన్, తమిళనాడు జానపద నృత్యాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సత్యం డాన్స్ అకాడమీ డాక్టర్ పద్మభూషన్ డాక్టర్ వెంపటి చినసత్యం పెద్దకుమార్తె మేళ్లచెరువు కామేశ్వరీ శిష్యబృందం శివపార్వతులు, పువ్వులు, మరకతమణిమయ, పూజ కోలాటం, మండూకశబ్దం, జయజయరవీంద్ర తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు.

ప్రజలపై మల్లన్న ఆశీస్సులు ఉండాలి

- నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: మల్లన్న ఆశీస్సులు ప్రజలపై ఉండి తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ ఆకాంక్షించారు. ఆదివారం పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో జరుగుతున్న మల్లికార్జున జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతరలు, ఉత్సవాలు తెలంగాణ సంస్కృతిని, ప్రతిబింబిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ స్వప్నశ్రీనివాస్, కురుమ సంఘం అధ్యక్షుడు పుల్ల కృష్ణ యాదవ్, దానయ్య, దశరథ్, రాజు, మల్లేశ్, ప్రవీణ్, బాల్ రాజ్ అంజి, దత్తు, నందు, జాతర నిర్వాహకులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

'నయా సాల్' జోష్

- 2024 న్యూ ఇయర్ వేడుకలు

గచ్చిబౌలి : హై ఓల్టేజ్ డీజే, పాశ్చాత్య సంగీతం, పాటలు, కేరింతలతో 2024 న్యూ ఇయర్ వేడుకలు అందరిలో జోష్ నింపాయి. '2023కి బైబై చెబుతూ.. నూతన సంవత్సర స్వాగత వేడుకలు అంబరాన్ని అంటాయి. ఐటీ కారిడార్‌లో ఎటుచూసినా న్యూ ఇయర్ సంబరాలే కనిపించాయి. నోవాటెల్, ట్రైడెంట్, వెస్టిన్, లెమన్ ట్రీ, రాడిసన్, షెరటాన్ తదితర హోటళ్లలో హోరెత్తించే సంగీతంతో నగరవాసులు ఉల్లాసంగా గడిపారు.

రూ.5 లక్షల ఇన్సూరెన్సు పాలసీ హర్షణీయం

- ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు

పటాన్‌చెరు టౌన్: రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు స్విగ్గీ, జొమాటో, హోంగార్డులు, వర్కింగ్ జర్నలిస్టులు, ఫ్లాట్ ఫారమ్ కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా అమలు చేయడం హర్షించదగ్గ విషయమని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటుచేసి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు మాదాసు రాజశేఖర్, న్యాయవాది రంగారావు నాయకులు ఆసిఫ్, సురేశ్, ఆటో యూనియన్ నాయకులు మధు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ నూతన సంవత్సరంలో తాము తీసుకున్న నిర్ణయాలతో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమై జీవితంలో మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ జీవితంలో ముందుకు వెళ్లడానికి తాము నిర్దేశించుకున్న ప్రణాళికతో విజయతీరాలకు చేరాలని ఆకాంక్షించారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన

ఆల్విన్‌కాలనీ: వీరవల్లి బుల్లెమ్మా కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ వి.అంకనీడు ప్రసాద్ ఆధ్వర్యంలో వివేకానందనగర్‌లోని సీనియర్ సిటిజెన్స్ పార్కులో గుండె సమస్యలు, మధుమేహం, ఇతర ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీనియర్ కన్సల్టెంట్, కార్డియాలజిస్టు, ఎలక్ట్రోఫిషియోలో జిస్ట్ కిమ్స్ హాస్పిటల్ వైద్యులు బి. హైగ్రీవ్‌రావు ఆదివారం సీనియర్ సిటిజెన్స్‌కు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎస్ అసిస్టెంట్ కమిషనర్ సీజీఎస్‌టీ మనోహర్‌రెడ్డి, బాలానగర్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, రిటైర్డు అసిస్టెంట్ కమిషనర్ బి. ఉదయ్‌కుమార్, వివేకానందనగర్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డీవీవీ సత్యనారాయణరెడ్డి, మాజీ సెక్రటరీ జి. నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

108వ మన్ కీ బాత్

కూకట్‌పల్లి: ప్రతి నెలా చివరి ఆదివారం ప్రసారమైన ప్రధాని నరేంద్ర మోదీ ×మన్ కీ బాత్× 108వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని బీజేపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాయినేని సూర్యప్రకాష్‌రావు ఆయన కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకుడు పాపారావుతో కలిసి వీక్షించారు. అనంతరం సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. 108 అనే సంఖ్యకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ప్రధాని 108వ ఎపిసోడ్‌కు కూడా అంతే విశిష్టత ఉందన్నారు. ఈ ఎపిసోడ్ అనంతరం జనవరి 22వ తేదీ అయోధ్యలో జరిగే శ్రీరాముని పండుగలో అందరం పాల్గొనాలని తెలిపారు.

12న పూజ సామగ్రి దుకాణాల ఏర్పాటుకు వేలం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలో వేంచేసియున్న ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరీ దేవస్థానం నారాయణ ఆశ్రమంలో కొబ్బరికాయల వేలం వేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 12వ తేదీ శుక్రవారం ఉదయం 11గంటలకు దేవస్థానంలో ఈ వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. కొబ్బరికాయాలు, పూజ సామగ్రి అమ్ముకొనుటకు ఈ సంవత్సరం జనవరి 15 నుంచి వచ్చే సంవత్సరం 14వ తేదీ వరకు అనగా ఒక సంవత్సరం పాటు రూ.20వేల దరావత్తు చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ దరావత్తు సొమ్మును డీడీ లేదా నగదు రూపంలో చెల్లించగలరని తెలిపారు.